అర్హతే ప్రామాణికంగా పథకాలు

- వైఎస్సార్‌సీపీ 'ఉత్తర' సమన్వయకర్త కె.కె.రాజు
- నియోజకవర్గంలో కొత్తగా 1,003 మందికి పింఛన్ల మంజూరు
- లబ్ధిదారుల ఆనందోత్సాహాలు



ఆనందం వ్యక్తం చేస్తున్న కొత్తగా పెన్షన్లు పొందిన లబ్ధిదారులతో కె.కె.రాజు

సీతంపేట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలనలో అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు అన్నారు. నియోజకవర్గంలో 1,003 మంది లబ్ధిదారులకు ప్రభుత్వం కొత్తగా వైఎస్సార్ పింఛన్ కానుక మంజూరు చేసింది. జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ బానాల శ్రీనివాసరావు అధ్యక్షతన బుధవారం అక్కయ్యపాలెం షాదీఖానాలో నిర్వహించిన కార్యక్రమంలో 14, 24, 25, 26, 42, 43, 44, 45, 46, 55 వార్డులకు చెందిన 629 మంది లబ్ధిదారులకు అయన చేతుల మీదుగా కొత్త పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వ హయాంలో చాలా తక్కువ మందికి పింఛన్లు ఇచ్చేవారని, 65 ఏళ్లు నిండిన వారికి రూ.1000 పెన్షన్ వచ్చేదని, కొత్తగా కావాలంటే ఎవరైనా చనిపోతే ఇచ్చేవారని గుర్తుచేశారు. అది కూడా వాళ్ల పార్టీకి చెందిన వ్యక్తులకు, జన్మభూమి కమిటీ చెప్పిన వారికే కొత్త పింఛన్ ఇచ్చే పరిస్థితి ఉండేదన్నారు.

2019లో సీఎంగా వైఎస్ జగన్ అధికారం చేపట్టాక అర్హతే ప్రామాణికంగా, కుల, మత రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ పింఛన్లు మంజూరు చేస్తున్నట్టు తెలిపారు. పెన్షన్ సొమ్మును రూ.2 వేలు చేసి.. దఫదఫాలుగా రూ.3 వేల వరకు పెంచుతామని చెప్పారన్నారు. ఆ క్రమంలో రూ.2,500 నుంచి ఈ నెల నుంచి రూ.2,750 ఇస్తునట్టు చెప్పారు. ప్రతి నెల ఒకటో తేదీన సూర్యోదయానికే ముందే ఇంటికి వచ్చి పింఛన్ సొమ్ము చేతిలో పెడుతున్నారన్నారు.



కొత్త లబ్ధిదారులకు పింఛన్లు అందిస్తున్న వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు

సీఎం జగన్‌కు అండగా నిలవండి..

అమ్మ ఒడి నుంచి ఇళ్ల పట్టాల వరకు ప్రభుత్వం అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాల ద్వారా ఉత్తర నియోజకవర్గానికి రూ.3,294 కోట్లు అందజేశారని కె.కె.రాజు తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి, అన్ని వర్గాల సంక్షేమం కోసం అహర్నిశలు శ్రమిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలందరూ అండగా నిలవాలన్నారు. ఫ్లోర్ లీడర్ బానాల శ్రీనివాసరావు మాట్లాడుతూ మేలు చేసిన నాయకుడిని మర్చిపోకుండా ఎప్పుడు ఎన్నికలు వచ్చినా ప్రజలంతా తమ మద్దతు తెలపాలని కోరారు. ఈ సందర్భంగా కొత్తగా పింఛన్లు పొందిన లబ్ధిదారులు ఆనందోత్సాహాలు వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, జోనల్ కమిషనర్లు ఆర్.జి.వి.కృష్ణ, విజయలక్ష్మి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కంపా హనోక్, స్టాండింగ్ కమిటీ మెంబర్ సారిపిల్లి గోవింద్, కార్పొరేటర్లు కె.అనిల్‌కుమార్‌రాజు, సాడి పద్మారెడ్డి, ఆళ్ల లీలావతి శ్రీనివాస్, పెద్దిశెట్టి ఉషశ్రీ, కె.వి.ఎస్.శశికళ, కో ఆప్షన్ సభ్యుడు సేనాపతి అప్పారావు, ఏపీడీలు పద్మావతి, దుర్గాప్రసాద్, పార్టీ వార్డు అధ్యక్షులు పీలా వెంకటలక్ష్మి, జి.వి.రమణి, పైడి రమణ, కె.పి.రత్నాకర్, సీనియర్ నాయకులు, కార్పొరేషన్ డైరెక్టర్లు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

క్లుప్తంగా

'టిడ్కో' డీడీల అందజేత



డీడీలను అందిస్తున్న కార్పొరేటర్ బర్కత్ అలీ

మద్రిపాలెం: జీవీఎంసీ 53వ వార్డు మద్రిపాలెంలో గత ప్రభుత్వంలో డీడీలు కట్టి టిడ్కో ఇళ్లు మంజూరు కాని వారికి కార్పొరేటర్ బర్కత్ అలీ బుధవారం గ్రీన్‌గార్డెన్స్ 295 సచివాలయంలో చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2018-2019లో టిడ్కో ఇళ్ల కోసం ఏవైతే డీడీలు కట్టించుకున్నారో, ఎవరికైతే లాటరీ ద్వారా ఇళ్లు మంజూరు చేయలేదో వారందరికీ చెక్కులు అందిస్తున్నామని తెలిపారు. వార్డులో ఇంకా ఎవరెవరికి ఇళ్లు మంజూరు కాలేదో వారి వారి పరిధిలోని సచివాలయ సిబ్బందిని సంప్రదించి వివరాలు అందజేసి చెక్కులను పొందాలని కోరారు. కార్యక్రమంలో రామారావు, షేక్ వలీ, బూస రామలక్ష్మి, జయలక్ష్మి, షేక్ నబీ, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులోకి రెండు బోర్లు



బోరును ప్రారంభిస్తున కార్పొరేటర్ బర్కత్ అలీ

మద్రిపాలెం: జీవీఎంసీ 53వ వార్డు శివనగర్, నరేంద్రనగర్ ప్రాంతాల్లో తాగునీటి బోర్లను బుధవారం పూజ చేసి బర్కత్ అలీ ప్రారంభించారు. ఇటీవల వీటి ఏర్పాటు శంకుస్థాపన చేశారు. అభివృద్ధిలో భాగంగా మద్రిపాలెం వాసులకు తాగునీటి సౌకర్యం కల్పించడం ఆనందంగా ఉందని కార్పొరేటర్ అన్నారు. బోర్లు అందుబాటులోకి రావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు బూస రామలక్ష్మి, జ్యోత్స్న, రామారావు, హనుమంతు, షేక్ నబీ, పాత్రో,కనకరాజు, షేక్ బాబ్జి, దుర్గ, భాస్కర్‌రావు, నాగేశ్వరరావు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ముగ్గుల పోటీలకు ఆహ్వానం

మురళీనగర్: సంక్రాంతి పండగను పురస్కరించుకుని ఈ నెల 7న వెశాఖి స్పోర్ట్స్ పార్కులో మురళీనగర్ వనితా వాకర్స్ క్లబ్ నిర్వహించనున్న ముగ్గుల పోటీలకు మహిళలను ఆహ్వానిస్తున్నట్లు క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు వి.జయప్రభాశర్మ, ఎస్.రోజారాణి ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోజు మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు జరిగే పోటీల్లో పాల్గొనాల్సిన వారు 99890 59084, 79891 22885, 94407 94626 నంబర్లలో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఎవరి రంగులు వారే తెచ్చుకోవాలని వారు చెప్పారు.

పాఠశాలలో భారీ వృక్షాల నరికివేత



రాంజీ ఎస్టేట్ ప్రాథమిక పాఠశాలలో నరికివేసిన చెట్లు

కంచరపాలెం: జీవీఎంసీ 47వ వార్డు రాంజీ ఎస్టేట్ ప్రాథమిక పాఠశాలను నూతనంగా తీర్చిదిద్దే పనిలో భాగంగా బుధవారం అక్కడి భారీ వృక్షాలను నరికివేశారు. ఎన్నో ఏళ్ల నుంచి విద్యార్థులకు నీడనిచ్చే చెట్లను తొలగించడం ఎంతో బాధాకరమని పిల్లల తల్లిదండ్రులు అసహనం వ్యక్తం చేశారు. పాఠశాలలో మౌలిక వసతుల అభివృద్ధికి చెట్లు అడ్డుకాదని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ చర్యపై సంబంధిత అధికారులకు ఫిర్యాదులు చేస్తామని విద్యార్థుల తల్లిదండ్రులు చెప్పారు.

ప్రజలతో మమేకం కండి



పథకాల కరపత్రం అందిస్తున్న సమన్వయకర్త కె.కె.రాజు, కార్పొరేటర్ అల్లు శంకరరావు

మద్రిపాలెం: వార్డు సచివాలయ సిబ్బంది ప్రజలతో మమేకమై పనిచేయాలని నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్ సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు అన్నారు. 49వ వార్డు ఏఎస్సార్ నగర్‌లో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. అక్కడి దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జీవీఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ అల్లు శంకరరావుతో కలిసి ఆయన ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధిని వివరించి, ప్రజలు సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సచివాలయ పనితీరుపై ఆరా తీసి సిబ్బందికి పలు సూచనలిచ్చారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ అవినీతి రహిత పాలనను ప్రజలకు చేరువ చేయాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. వాటి అమలు తీరుపై నిరంతరం పర్యవేక్షణ ఉండాలనే ఉద్దేశంతో గడప గడపకు కార్యక్రమాన్ని రూపకల్పన చేశారని చెప్పారు. వితంతువులు, వృద్ధులు, దివ్యాంగులకు ఆర్థిక భరోసా కల్పించేలా పెన్షన్ పెంపునకు సీఎం శ్రీకారం చుట్టారన్నారు. పేద, మధ్య తరగతి పిల్లలకు విద్య చేరువ కావాలనే లక్ష్యంతో అమ్మ ఒడి పథకం ద్వారా ఆర్థిక చేయూత అందించడంతోపాటు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు సాంకేతిక విద్యను అందజేయాలనే ఉద్దేశంతో ట్యాబ్‌లు అందిస్తున్నారన్నారు. సచివాలయాల ద్వారా ప్రజలకు అందుతున్న సేవలను నేరుగా పర్యవేక్షించేలా కన్వీనర్లను నియమించినట్టు తెలిపారు. ముఖ్యమంత్రి అందిస్తున్న సంక్షేమ ఫలాలు, సేవలు ప్రతి గడపకు చేరాలని కె.కె.రాజు ఆకాంక్షించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు ఎస్.రవికుమార్, ఐ.రవికుమార్, రాయుడు శ్రీను, నూకరాజు, ఢిల్లీరావు, ఆదిరెడ్డి శ్రీను, కమలాకుమారి, చంద్రశేఖర్, పావని, రామకృష్ణ, ప్రశాంత్, రాజేష్, నాగరాజు, శ్రీరాములు, బైపీ, బి.శంకర్, మున్నా, బి.నాయుడు, సీనియర్ నాయకులు, చిరంజీవి, రామరెడ్డి, షేక్ బాబ్జి, గురుపోజీ, వెంకటేష్ పాల్గొన్నారు.

భవిత సెంటర్‌లో బ్రెయిలీ జయంతి



భవిత సెంటర్‌లో కేక్ కట్‌చేస్తున్న డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ సువర్ణ

సీతంపేట: అక్కయ్యపాలెం భవిత సెంటర్‌లో బుధవారం విద్యావేత్త లూయిస్ బ్రెయిలీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథి డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ కె.సువర్ణ కేక్ కట్ చేసి పిల్లలకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంధుల జీవితాల్లో వెలుగులు నింపిన మహోన్నత వ్యక్తి లూయిస్ బ్రెయిలీ అని అన్నారు. దృష్టి లోపం ఉన్న వారి కోసం చదవడానికి, రాయడానికి వీలుగా ప్రత్యేక లిపిని ఆవిష్కరించారని తెలిపారు. ప్రపంచ వ్యాప్యంగా బ్రెయిలీ లిపి గుర్తింపు పొంది, నేటికీ ఉపయోగకరంగా ఉందన్నారు. కార్యక్రమంలో జీవీఎంసీ హైస్కూల్ హెచ్.ఎం లక్ష్మీనరస, భవిత టీచర్ జగదాంబ, దివ్యాంగ విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యం



యోగాసనాన్ని తిలకిస్తున్న మిజోరం గవర్నర్ హరిబాబు

మురళీనగర్: యోగా చేయడం వల్ల ఆరోగ్యం మెరుగుపడుతుందని మిజోరం రాష్ట్ర గవర్నర్ డాక్టర్ కంభంపాటి హరిబాబు అన్నారు. మురళీనగర్ సమీపాన తెన్నేటినగర్‌లో బుధవారం 50వ వార్డు కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్‌తో కలిసి క్షీరాబ్ది యోగా కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మన పూర్వీకులు, రుషులు కనుగొన్న యోగా ప్రక్రియలు నేడు ప్రపంచ వ్యాప్తంగా ప్రాచుర్యం పొందినట్లు వివరించారు. కొన్ని రకాల యోగాసనాలు, వ్యాయామం చేయడం వల్ల శరీరంలోని శోషరస ద్రవాలు పెరిగి వ్యాధినిరోధక శక్తిని పెంపొందిస్తాయన్నారు. ప్రతి ఒక్కరూ యోగా తన దినచర్యలో భాగంగా చేసుకోవాలని సూచించారు. రోజూ కనీసం గంట సేపు యోగా చేస్తే రోజంతా చైతన్యంగా ఉండవచ్చన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు, 51వ వార్డు కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ, ఎస్ఎస్‌టీఎల్ డైరెక్టర్ శ్రీనివాస్, గురుదేవా చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకుడు జగదీష్‌బాబు, యోగా కేంద్రం స్థాపకుడు డాక్టర్ లక్ష్మీనారాయణ, శ్రీలక్ష్మి, చాతుర్య పాల్గొన్నారు.

3 ద్విచక్ర వాహనాల వేలం

మద్రిపాలెం: స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్) మురళీనగర్ వద్ద ఉన్న గోపాలపట్నం సర్కిల్-4 కార్యాలయంలో బుధవారం 3 ద్విచక్ర వాహనాలకు వేలంపాట నిర్వహించారు. జీఎస్టీతో కలిపి మొత్తం రూ.61,242 ఆదాయం వచ్చినట్టుగా అసిస్టెంట్ సూపరింటెండెంట్ పి.శ్రీనాథుడు తెలిపారు. వివిధ కేసుల్లో పట్టుబడి సీజ్ చేసిన వాహనాలను సంబంధిత యజమానులకు నోటీసులు ఇచ్చినా.. తీసుకెళ్లకపోవడంతో, కోర్టు అనుమతితో వేలం వేసినట్టు ఆయన చెప్పారు. వేలంలో పలువురు పాల్గొని నిర్ణయించిన ధరకు వాటిని దక్కించుకున్నారన్నారు. కార్యక్రమంలో సర్కిల్-4 సీఐ సీహెచ్‌వీఎస్ ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

బీసీల జాగృతిపై సదస్సు నేడు

ఎంవీపీ కాలనీ: ఏపీ బీసీ వెల్ఫేర్ జేఏసీ ఆధ్వర్యంలో బీసీల జాగృతి, సాధికారతపై విశాఖ వేదికగా సదస్సు నిర్వహించనున్నట్టు సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ హనుమంతు లక్ష్మణరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీచ్ రోడ్డులోని బ్లాక్ అండ్ వైట్ హోటల్లో గురువారం ఉదయం ఈ సదస్సు జరగనుందని పేర్కొన్నారు. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి బీసీ నాయకులు, బీసీ సంఘాల ప్రతినిధులు హాజరవుతారన్నారు.

కవిత్వం అజరామరం



మాట్లాడుతున్న ఆచార్య వేదుల సుబ్రహ్మణ్యశాస్త్రి

సీతంపేట: కవిత్వం హృదయ రంజకంగా, అలంకారయుక్తంగా, సందేశాత్మకంగా ఉండాలని ఆచార్య వేదుల సుబ్రహ్మణ్యశాస్త్రి అన్నారు. సహృదయ సాహితి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ప్రిజమ్ కళాశాలలో బుధవారం జరిగిన కవి సమ్మేళనంలో ముఖ్య అతిథిగా ఆయన ప్రసంగించారు. ప్రాచీన కవుల సాహిత్యం మార్గదర్శకం కావాలని, సాహిత్యం ప్రతి ఒక్కరి సొత్తు, కవిత్వం అజరామరం, సమాజాన్ని సరైనా దారిలో నడిపేది కవిత్వమన్నారు. సభాధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ సహృదయ సాహితి సంస్థ 42 ఏళ్లుగా సాహిత్య సేవ చేస్తూ, తెలుగు సాహిత్యానికి, కవులకు ఒక అధ్యయన కేంద్రంగా, ఎందరో కవులకు మార్గదర్శకంగా విలసిల్లుతోందన్నారు. రచయిత కె.జి.వేణు మాట్లాడుతూ ప్రముఖ కవి అదృష్ట దీపక్ రచనలను సభకు పరిచయం చేశారు. అనంతరం జరిగిన కవి సమ్మేళనంలో పి.ఎల్.వి.ప్రసాద్, చిన సూర్యనారాయణ, కొత్తూరు రమణ, టి.పట్టాభి రామారావు, డి.వి.సూర్యారావు, దేవులపల్లి పద్మజ, పంతుల లలిత, కుప్లి భీమేశ్వరరావు, పి.వి.ఆర్.కె.రావు, రామతాత, వైశ త్యవతి, కె.రఘువీర్ తదితరులు కవితలు చదివి వినిపించారు.

చిత్తశుద్ధితోనే హక్కుల పరిరక్షణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మానవ హక్కుల కౌన్సిల్ ప్రతినిధులు

దాబాగార్డెన్స్ : మానవ హక్కులపై ప్రజలకు అవగాహన ఉండాలని, హక్కుల పరిరక్షణకు ప్రభుత్వాలు చిత్తశుద్ధితో వ్యవహరించాలని మానవ హక్కుల కౌన్సిల్ రాష్ట్ర కార్యదర్శి మంత్రి శ్యాంప్రసాద్ పేర్కొన్నారు. నగరంలో మానవ హక్కుల కౌన్సిల్ కార్యాలయంలో బుధవారం నూతన సంవత్సర క్యాలెండర్‌ను కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు జగన్మోహనరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మానవ హక్కుల కమిషన్ సూచనలు, కేసుల విషయంలో ఇచ్చిన ఉత్తర్వులను ప్రభుత్వాలు, అధికార యంత్రాంగం అమలు చేసినప్పుడే ప్రజల హక్కు ల పరిరక్షణ జరుగుతుందన్నారు. మానవ హక్కులు, మహిళల హక్కులు, బాలల హక్కులు, పర్యావరణ పరిరక్షణకు లాభాపేక్ష లేకుండా భవిష్యత్‌లో మరింత అంకితభావంతో శ్రమిస్తామన్నారు. శ్రీకాకుళం జిల్లాతో సహా రాష్ట్రంలో అన్ని జిల్లాల్లో మానవ హక్కుల కౌన్సిల్ సభ్యులను ప్రోత్సహిస్తామని చెప్పారు. 23 ఏళ్లుగా తమ సంస్థ హక్కుల పరిరక్షణకు కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో గుండు అప్పలరాజు, కె. రవికుమార్, లాలం నారీమణి, నారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.

వాహనాలను ధ్వంసం చేస్తున్న ఆకతాయిలు



ధ్వంసమైన స్కూటీ

మద్రిపాలెం: కంచరపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో వాహనాలను ధ్వంసం చేస్తున్న ఘటనపై బుధవారం కేసు నమోదైంది. 47వ వార్డు కప్పరాడ అరుంధతీ నగర్, సంజీవ్ నగర్ ప్రాంతాల్లో ఆకతాయిలు మద్యం తాగి అర్ధరాత్రి సమయాల్లో వాహనాలను ధ్వంసం చేస్తున్నట్టు స్థానికులు ఫిర్యాదు చేశారు. కంచరపాలెం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సింహాచలం వచ్చే మార్గాల్లో స్వాగత ద్వారాలు

ఈవోకు ట్రస్ట్ బోర్డు సభ్యుల సూచన

సింహాచలం: సింహాచలం వచ్చే మార్గాల్లో దేవస్థానం స్వాగత ద్వారాలు ఏర్పాటు చేయాలని దేవస్థానం ట్రస్టుబోర్డు సభ్యులు శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ఈవో వి.త్రినాథరావుకు సూచించారు. సింహగిరిపై ఆలయ బేడా మండపంలో బుధవారం ట్రస్టుబోర్డు సభ్యులు గంట్ల శ్రీనుబాబు, వారణాసి దినేష్‌రాజ్, పెనుమత్స శ్రీదేవివర్మ పలు అభివృద్ధి పనుల విషయంపై ఈవోతో సమావేశమయ్యారు. పెందుర్తి ఆనందపురం కొత్త మార్గంలో సింహాచలం వెళ్లే రహదారిలో స్వాగత ద్వారం ఏర్పాటు చేయాలని సూచించారు. విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల నుంచి ఆమార్గంలో వచ్చే భక్తులు ఎటు వెళ్లాలో తెలియని పరిస్థితి నెలకుందని తెలియజేశారు. శ్రీనివాసనగర్‌లో దేవస్థానం నిర్మిస్తున్న కల్యాణ మండపాల పనులు వేగవంతం చేసి తక్షణమే భక్తులకు అందుబాటులోకి తేవాలని.. కొండ దిగువ శ్రీదేవి కాంప్లెక్స్‌లోని సత్రాలను వెంటనే అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. సింహగిరి మెట్లమార్గం అభివృద్ధి చేయాలని, కనుమ రోజు స్వామివారు కొండదిగువకు వస్తారని గుర్తుచేశారు.

చందనం సమర్పణకు రూ. 50వేల విరాళం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి చందనం సమర్పణ నిమిత్తం దేవస్థానం ట్రస్టుబోర్డు సభ్యుడు వారణాసి దినేష్‌రాజ్ రూ. 50 వేల విరాళం చెక్కు రూపంలో ఈవో త్రినాథరావుకు అందజేశారు. కార్యక్రమంలో ఏఈవో నరసింహరాజు, సూపరింటెండెంట్ పిళ్లా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ధనుర్మాస పూజలు



చింతలగ్రహారం శ్రీకృష్ణాలయంలో దీపాలంకరణ సేవ

సింహాచలం: ధనుర్మాస పూజలు బుధవారం పలు ఆలయాల్లో విశేషంగా నిర్వహించారు. సింహగిరిపై తెల్లవారు జామున 3గంటలకు స్వామికి సుప్రభాత సేవ చేశారు. విశేష ఆరాధన, చతుర్వేద పారాయణం, ఉపనిషత్తు పారాయణం, తిరుప్పావై సేవాకా లం అనంతరం గోదాదేవికి బేడామండపంలో తిరువీధిని వైభవంగా నిర్వహించారు. ఆలయ స్థానా చార్యులు టి.పి.రాజగోపాల్ తదితరులు పూజలు చేశారు.

- పెందుర్తి వెంకటాద్రిపై ధనుర్మాస పూజలు ఘనంగా నిర్వహించారు.తిరుప్పావై సేవాకాలం అనంతరం గోదాదేవి చెంతన ప్రత్యేక పూజలు చేసి హారతులు అందజేశారు. భక్తులు పెద్ద ఎత్తున ఈ పూజల్లో పాల్గొన్నారు. భక్తుకు ప్రసాద వితరణ చేశారు. ఆలయ అర్చకులు రామానుజమ్ పూజల ను నిర్వహించారు.
- శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి చెందిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో గోదాదేవి అమ్మవారిని విశేష అలంకరించారు. పాశుర విన్నప పారాయణ ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు భార్గవ్ భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.
- పెందుర్తి మండలం చింతలగ్రహారం శ్రీకృష్ణాలయంలో శంఖుచక్రనామాలకు విశేషంగా దీపాలంకరణ చేశారు. పాశుర విన్నప పారాయణ ఘనంగా నిర్వహించారు.



వెంకటాద్రిపై గోదాదేవికి హారతి సమర్పిస్తున్న అర్చకుడు రామానుజమ్

లెర్నర్ పోర్టల్‌లో కోర్సు మెటీరియల్

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం దూర విద్య కేంద్రంలో 2022-23 విద్యా సంవత్సరానికి డిగ్రీ, పీజీ కోర్సుల్లో ప్రవేశం పొందిన విద్యార్థులకు కోర్సు మెటీరియల్‌ను లెర్నర్ పోర్టల్‌లో పొందుపరిచారు. బుధవారం ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి తన కార్యాలయంలో దీనిని లాంఛనంగా ప్రారంభించారు. విద్యార్థులు తమ గుర్తింపు నంబరును నమోదు చేసి కోర్సు మెటీరియల్‌ను ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, దూరవిద్య సంచాలకుడు ఆచార్య కె.విశ్వేశ్వరరావు, ఆచార్య చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మూల్యాంకన కేంద్రం పరిశీలన



మూల్యాంకన కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఏయూ వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం పరీక్షల మూల్యాంకన కేంద్రాన్ని వర్సిటీ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి బుధవారం ఉదయం పరిశీలించారు. మూల్యాంకన ప్రక్రియను వేగవంతం చేసేలా కొత్తగా ఏర్పాటు చేసిన ఈ కేంద్రాన్ని ప్రత్యక్షంగా సందర్శించారు. మూల్యాంకనం జరుగుతున్న విధానాన్ని పరిశీలించారు. అనంతరం కేంద్రం పరిసరాలను పరిశీలించి, అవసరమైన మరమ్మతులు చేపట్టాలని యూనివర్సిటీ ఇంజినీర్‌కు సూచించారు. రెక్టార్ ఆచార్య కె.సమత, రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, డీన్‌లు ఆచార్య డి.వి.ఆర్.మూర్తి, వజీర్ మహ్మద్ పాల్గొన్నారు.

సమాజంపై విద్యార్థులకు అవగాహన అవసరం

ఏయూ క్యాంపస్: సమాజంపై ప్రతి విద్యార్థికి అవగాహన కల్పించాలని ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ అన్నారు. బుధవారం ఉదయం ఏయూ మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో బోర్డ్ ఫర్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ త్రూ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కమ్యూనిటీ సర్వీస్ ప్రాజెక్ట్ మెంటార్ ట్రెనింగ్ ప్రొగ్రాంను ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ దేశాభివృద్ధిలో యువతను భాగం చేయాలని కోరారు.విద్యార్థుల ఆలోచన సరళిలో మార్పు తీసుకురావడానికి కృషి జరగాలన్నారు. కార్యక్రమ సమన్వయకర్త ఆచార్య ఎన్.ఎ.డి.పాల్ మాట్లాడుతూ విద్యార్థులను కమ్యూనిటీ సర్వీస్ దిశగా నడిపించాల్సిన అవసరం ఉందన్నారు. రిసోర్స్ పర్సన్ ఇ.పి.ఎస్.భాగ్యలక్ష్మి మాట్లాడుతూ దేశం కోసం పాటు పడేలా యువతను తీర్చిదిద్దడం అవసరమన్నారు. కార్యక్రమంలో నగరంలోని పలు డిగ్రీ కళాశాలలకు చెందిన 68 మందికి పైగా అధ్యాపకులు పాల్గొన్నారు.

సిటు రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నర్సింగరావు



దాబాగార్డెన్స్: సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సీహెచ్ నర్సింగరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. భీమవరంలో నిర్వహించిన 16వ ఏపీ రాష్ట్ర సిటు మహాసభల్లో నర్సింగరావు ఎన్నికయ్యారు. రాష్ట్ర అధ్యక్షుడిగా ఏవీ నాగేశ్వరరావు, కోశాధికారిగా కేఆర్‌కే మూర్తి ఎన్నికకాగా, ఉపాధ్యక్షులుగా ఎంఏ గఫూర్, ఉమామహేశ్వరరావు, కె. సుబ్బరావమ్మ, జి. బేబిరాణి, పి. అజయ్ కుమార్, కె. మురళీ, నాగరాజు, జి. ఓబులు, సీహెచ్ శ్రీనివాసరావు, కె. అజయ్‌కుమార్, రాజా రామ్మోహన్‌రాయ్, కేఎం శ్రీనివాస్, రాష్ట్ర కార్యదర్శులుగా కె. ధనలక్ష్మి, కె. ఉమామహేశ్వరరావు తదితరులను ఎన్నుకున్నారు.

మదర్ ఇండియా ట్రస్టుకు అభినందన



గవర్నర్ హరిబాబును సత్కరిస్తున్న ట్రస్టు ప్రతినిధులు

సీతంపేట: మదర్ ఇండియా వెల్ఫేర్ ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షుడు మళ్ల వెంకటరావు, గౌరవాధ్యక్షుడు బండే వెంకటేశ్వరరావులు బుధవారం మిజోరాం రాష్ట్ర గవర్నర్ కంభంపాటి హరిబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. మూడేళ్లుగా ట్రస్టు చేపట్టిన సేవా కార్యక్రమాలతో రూపొందించిన పుస్తకానికి సంబంధించి అభినందిస్తూ తన సందేశాన్నిచ్చిన గవర్నర్‌ను వారు దుశ్శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ట్రస్టు ప్రధాన కార్యదర్శి కందాల ప్రభాకర్‌రావు, కోశాధికారి సిహెచ్.మహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.